
సాక్షి
కాకినాడ

గురువారం । 19 । అక్టోబర్ । 2023



14,700 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,200 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు.



సువర్ణావకాశం ఓపెన్

అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసిన వారికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం సువర్ణావకాశం కల్పిస్తోంది. - IIలో ▸

రేపు ఎస్సీ, ఎస్టీ స్పందన



కాకినాడ సిటీ: ఎస్సీ, ఎస్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక స్పందన శుక్రవారం మధ్యాహ్నం జరుగుతుంది. అలాగే, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ కలెక్టరేట్ స్పందన హాలులో ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తారన్నారు.

న్యూస్‌రీల్

లలితాదేవిగా పంచారామ క్షేత్రంలో అమ్మవారు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవి లలితాదేవిగా దర్శనం

సామర్లకోట: సామర్లకోట పట్టణంలో పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బుధవారం లలితాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాతి ఉత్సవాలల్లో భాగంగా అమ్మవారిని ప్రతీ రోజు ఒక అలంకరణ చేస్తున్నారు. దీనిలో భాగంగా నాల్గవ రోజు అమ్మవారిని లలితాదేవిగా అలంకరణ చేశారు.

అర్చకుల గౌరవ వేతనం పెంపు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): చిన్న ఆలయాల్లో చాలీచాలని గౌరవ వేతనంతో ఇబ్బందులు పడుతున్నఅర్చకులకు ప్రభుత్వం దసరా సందర్భంగా శుభ వార్త అందించింది. వారి గౌరవ వేతనం పెంచినట్లు జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. కాకినాడలోని దేవదాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తక్కువ ఆదాయం వచ్చే ఆలయాలను ఏ,బీ కేటగిరి కింద విభజించి ప్రభుత్వం గౌరవ వేతనం పెంచిందన్నారు. ఏ కేటగిరి దేవాలయాల్లో అర్చకులకు రూ.15,625 తక్కువ కాకుండా, బీ కేటగిరి ఆలయాల అర్చకులకు రూ.10 వేలు తక్కువ కాకుండా గౌరవ వేతనం ఇస్తున్నట్లు చెప్పారు. పెంచిన గౌరవ వేతనం దేవదాయశాఖ కామన్‌గుడ్ ఫండ్ నుంచి చెల్లిస్తుందన్నారు. ఆదాయం లేని ఆలయాలపై ఈ భారం పడకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందన్నారు. తొండంగిలోని రామలింగేశ్వరస్వామి ఆలయ అర్చకుడికి ప్రస్తుతం రూ.4 వేలు ఇస్తుండగా తాజాగా వేతనం మరో రూ.2వేలు పెంచిందన్నారు. కరప మండలం గురజానాపల్లి లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడికి రూ. 6 వేతనం పెంచారు. సామర్లకోట చంద్రశేఖర స్వామి దేవాలయంలో అర్చకుడిని ప్రస్తుతం రూ. 3 వేలు వేతనం తీసుకొంటున్నారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ. 7 వేలు వేతనం పెరిగిందన్నారు. జిల్లాలో ఇలా 24 ఆలయాల్లో అర్చకులకు గౌరవ వేతనం పెంచినట్లు ఆయన వివరించారు.

గాయత్రి మాతగా అమ్మవార్లు దర్శనం



గాయత్రి మాతగా పూజలందుకుంటున్న రత్నగిరి వనదుర్గ అమ్మవారు

అన్నవరం: జిల్లాలోని ముఖ్య ఆలయాల్లో దసరా సందర్భంగా దుర్గాదేవి అమ్మవారు రోజుకో అలంకరణతో భక్తులకు దర్శనమిస్తున్నారు. రత్నగిరిపై బుధవారం సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి, వనదుర్గ, కనకదుర్గ, అమ్మవార్లను గాయత్రి మాత అలంకరించి పూజించారు. ఐదు శిరస్సులతో పది చేతులలో గాయత్రి మాతగా ఒక్కో చేతిలో ఒక్కో ఆయుధం ధరించి ఒక చేతి తో పుస్తకం, మరో చేతిలో గులాబీ, మిగిలిన రెండు చేతులను అభయహస్తాలుగా చూపుతూ గాయత్రి దేవిగా దర్శనిమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు దర్బారు మండపంలో రుత్విక్కులు చండీ సప్తశతీ పారాయణలు, రామాయణ, మహాభారత పారాయణ, మహాలింగార్చన, సూర్యనమస్కారాలు నిర్వహించారు.

20న కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ ఐడియల్ ఆర్ట్స్ కాలేజీలో ఈనెల 20న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి హరిశేషు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా చేతుల దీనికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. సుమారు 11 కంపెనీలు 500 ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఈ జాబ్‌మేళాలో పదోవతరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువకులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9949156583, 8500885866 నంబర్లను సంప్రదించవచ్చని హరిశేషు వివరించారు.

కులవృత్తులకు కొండంత భరోసా



- నేడు జగనన్న చేదోడు కింద సాయం
- లబ్ధిదారులకు రూ.10వేల వంతున జమ
- జిల్లాలో 12,534 మందికి ప్రయోజనం
- అర్హత ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక

కాకినాడ సిటీ: కులవృత్తిపైనే ఆధారపడిన వారు కొందరు.. చేతి పనితో సంతృప్తి పడుతున్నవారు మరికొందరు. వీరందరినీ ఆదుకునేందుకు గతంలో ఏ ప్రభుత్వమూ ఆలోచించలేదు. వారిని ఆర్థికంగా ఆదుకుని కొంత మేరైనా చేదోడు నందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భావించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు ప్రతిపక్ష నాయకుని హోదాలో రాష్ట్రంలో చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రలో వారి కష్టాలు స్వయంగా చూశారు. నేరుగా వారి సమస్యలు తెలుసుకున్నారు. నేనున్నానని వారికి భరోసా కల్పించారు. అన్నమాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని అమలు చేశారు.

ఆ మూడు వృత్తుల వారికి ఆర్థిక సాయం

కులవృత్తులే జీవనాధారంగా బతుకు బండిని నడిపిస్తున్న రజకులు, నాయీ బ్రాహ్మణులతో పాటు టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి సంక్షేమానికి సీఎం బాటలు వేశారు. ఈ మూడు రంగాలపై ఆధారపడిన ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా చేతివృత్తుల వారికి ఆసరాగా నిలిచే జగనన్న చేదోడు పథకం కింద నగదు గురువారం అందజేయనున్నారు. 2020 జూన్ 10న తొలి విడతగా జగనన్న చేదోడు పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. షాపులు ఉన్న రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్ల బ్యాంక్ ఖాతాల్లో ఆర్థిక సాయాన్ని జమ చేశారు. 21 నుంచి 60 ఏళ్లలోపు వయసున్న వృత్తిదారులు ఈ పథకానికి అర్హులు. ఇప్పటి వరకూ మూడు పర్యాయాల్లో 37,305 మంది లబ్ధిదారులకు రూ. 37.29 కోట్లను ప్రభుత్వం అందజేసింది. మూడు పర్యాయాలు విజయవంతంగా పూర్తి చేశారు. తాజాగా ఈ ఏడాది మరోసారి లబ్ధిదారులకు గురువారం జగనన్న చేదోడు పథకం కింద లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో రూ.10వేలు జమ చేయనున్నారు.



నేడు నాలుగో విడత అమలు:

2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగో విడత జగనన్న చేదోడు పథకాన్ని గురువారం సీఎం జగన్‌డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతి ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి 12,534 మందికి రూ. 12.53 కోట్లు మేర లబ్ధి చేకూరనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే కార్యక్రమంలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు.

ఈ ఏడాది నియోజకవర్గాల వారీ లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	మహిళా లబ్ధిదారులు	పురుష లబ్ధిదారులు	మొత్తం లబ్ధిదారులు	లబ్ధి (రూ. కోట్లలో)
తుని	1536	1147	2683	2,68
ప్రత్తిపాడు	984	809	1793	1.79
జగ్గంపేట	757	1006	1753	1.76
కాకినాడ రూరల్	772	890	1662	1.66
పెద్దాపురం	845	757	1602	1.60
పిఠాపురం	669	784	1453	1.45
కాకినాడ సిటీ	400	519	1018	1.02
మొత్తం	6062	5912	11974	11.97

మూడు విడతల్లో ఇప్పటి వరకు చేకూరిన లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారులు	ఆర్థిక సాయం (రూ. కోట్లలో)
2020–21	12,207	రూ.12.20
2021–22	11,784	రూ. 11.78
2022–23	13,314	రూ.13.31

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



జగనన్న చేదోడు పథకం కింద లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాం. ఈ పథకం ద్వారా వచ్చే ఆర్థిక సాయాన్ని వృత్తిదారులు వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశం. నాలుగో విడత ఆర్థిక సాయం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. దీనికి సంబంధించి కలెక్టరేట్‌లో గురువారం జిల్లాకు సంబంధించి సమావేశం నిర్వహించనున్నాం.

– ఎస్‌పీఎస్ సుబ్బలక్ష్మి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్

పంచారామ క్షేత్రంలో మంత్రి దంపతులు పూజలు



మంత్రికి పంచారామక్షేత్రంలోని స్వామివారి అమ్మవార్ల ఫోటో అందజేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రవాణా శాఖామంత్రి పినిపే విశ్వరూప్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు స్వాగతం పలికారు. ఈఓ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, ధ్వజ స్థంబం, పెద్ద నంది, మూలవిరాట్, ఉపాలయాలను వారు దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు, అమ్మవారికి మంత్రి దంపతులు కుంకుమ పూజలు చేశారు. ఆలయ వేదపండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిదిరాజు వెంకన్నలు మంత్రి దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. మంత్రికి స్వామి వారి ఫోటోను అందజేసి మంత్రి దంపతులను దవులూరి దొరబాబు సత్కరించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు నేతల హరిబాబు, పాగా సురేష్‌కుమార్, పితాని కృష్ణ, ఎస్ సురేష్, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, సీఐ కె దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు టెండర్ల ప్రక్రియపై అవగాహన

కాకినాడ: జిల్లాలోని ఆర్టీసీ డిపోకు చెందిన స్థలాలను 15 ఏళ్ళపాటు లీజు ప్రాతిపదికన ఇవ్వనున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి(డీపీటీవో) శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, ఏలేశ్వరం ప్రాంతాల్లోని స్థలాల లీజుకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పిలిచామన్నారు. టెండర్ల ప్రక్రియపై అవగాహన కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

భవిష్యత్ కృత్రిమ మేధదే..



విద్యార్థుల రోబోరేస్ పరిశీలిస్తున్న కళాశాల ఏడీ డాక్టర్ నాయిడు,బీవీ రాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేటి యువత,అధ్యాపకులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) గురించి ఆలోచించాలని ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఇవీఎల్ నాయుడు పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధ వారం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, రోబోటిక్స్ ఆధ్వర్యంలో రోబో టెక్నికల్ రేస్ ఈవెంట్–23 నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఇవీఎల్ నాయుడు హాజరై మాట్లాడుతూ సమాజ అవసరాల ఆధారంగా సాఫ్ట్‌వేర్ రూపొందించాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా మానవునికి భవిష్యత్‌లో సంభవించే ఆరోగ్య పరమైన సమస్యలు వైద్యులు గుర్తించగలరన్నారు. ప్రస్తుత యువత సాఫ్ట్‌వేర్ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. డిగ్రీ విద్యార్థులు ఇప్పుడు ఇంజినీరింగ్ విద్యార్థులతో సమానంగా పోటీపడి సాఫ్ట్‌వేర్‌లో రాణించడం సంతోషమన్నారు. డేటాప్రో కంప్యూటర్ సీనియర్ లీడ్ బీవీ రాజు మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు,పీజీ విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించి వినూత్న ఆవిష్కరణలు,పరిశోధనలు చేపట్టేందుకు ఆసక్తి కనబరచాలన్నారు. రాబోయే తరం ఆర్టిఫీషియల్ రంగానిదే ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన రోబో రేస్ సందర్శించారు. ప్యాకల్టీలు పి.జై కృష్ణ, క్యాంపస్ ఇన్‌చార్జ్ మూర్తి,డీన్ సిదార్థరెడ్డి,వీఎస్ఎన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల సమూల నిర్మూలనకు చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా



బాల్య వివాహాల నిరోధంపై ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర అధికారులు

కాకినాడ సిటీ: బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా కోరారు. కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కలిగించేలా చూడాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహం వలన పిల్లలపై ఎటువంటి దుష్పరిణామాలు ఏర్పడతాయో విశదీకరించాలన్నారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, ఇందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, ఒక లక్ష రూపాయలు జరిమానా విధిస్తారని తెలియచెప్పాలన్నారు. బాల్య వివాహంపై సమాచారాన్ని 112 లేదా చైల్డ్‌లైన్ 1098 నంబర్‌కు తెలియజేయాలన్నారు. ఎక్కడా ఒక్క బాల్య వివాహం కేసు కూడా నమోదు అవ్వకూడదన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు. హాట్ స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకముందు జరిగిన తర్వాత కూడా కేసులు పెట్టవచ్చునన్నారు. అటువంటి వారిని గుర్తించినట్లయితే 1098కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. తెలిపిన వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఈ సమాచారాన్ని సక్రమంగా పంపితే బాల్యవివాహాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించే పోస్టర్‌ను జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ కె ప్రవీణ, డీసీపీవో సిహెచ్ వెంకటరావు, ఆర్డీవో ఎన్ వీవీ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి ఆర్ విక్టర్, డీఈవో నాగమణి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఏ విజయశాంతి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

కిర్లంపూడి: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి కె.పట్టాభిరామ్ బుధవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎంపికైన 18 మంది ఖోఖో క్రీడాకారులకు స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మందిని ఎంపిక చేశామని తెలిపారు. వీరు ఈ నెల 20 నుంచి 22 వరకూ చిత్తూరు జిల్లా యాదమర్రిలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని వివరించారు. అత్తిలి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వి.రాంబాబు క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఎంపికైన విద్యార్థులను వైఎంఎస్‌సీ అధ్యక్షులు పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ, పలువురు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

క్లుప్తంగా

హోరాహోరీగా సౌత్ జోన్ చెస్ పోటీలు


ఉత్సాహంగా చెస్ ఆడుతున్న విద్యార్థులు

పెద్దాపురం: స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే సౌత్ జోన్ సీబీఎస్ఈ చెస్ పోటీలు రెండో రోజైన బుధవారం హోరాహోరీగా కొనసాగాయి. ఏపీ చెస్ చాంపియన్‌షిప్ అధ్యక్షుడు కేవీవీ శర్మ, కార్యదర్శి ఎస్.భీమారావు, శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్‌ల పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 300 పాఠశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో తలపడుతున్నారు. మొదటి రోజు మూడు రౌండ్లు, రెండో రోజు రెండు రౌండ్లలో పోటీలు జరిగాయి. గురువారం ముగింపు సభ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామని విజయ్‌ప్రకాష్ తెలిపారు.

ఐఈఆర్‌పీ పోస్టుల భర్తీకి రేపటి నుంచి టెస్టులు

కాకినాడ సిటీ: ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్) కోసం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని భవిత కేంద్రాల్లో 42 ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్ (ఐఈఆర్‌పీ) పోస్టులు భర్తీ చేయనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో వీటిని పూర్తి కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామని ఏపీ సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి.నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ మెరిట్ లిస్టులో 1:3 నిష్పత్తిలో 57 మంది (ఎంఆర్) అభ్యర్థులకు శుక్రవారం, 1:3 నిష్పత్తిలో 57 (హెచ్ఐ/వీఐ) అభ్యర్థులకు శనివారం జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యాన స్కిల్, పర్సనాలిటీ టెస్టులు జరుగుతాయన్నారు. వీటిని కాకినాడలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ టెస్టులకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని, ముఖ్యంగా స్పెషల్ బీఈడీ/డీఎడ్ సర్టిఫికెట్ రీహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు 100 పాయింట్లు సాధించాలన్నారు. సంబంధిత అభ్యర్థుల సెల్ నంబర్లకు వివరాలతో మెసేజ్ వస్తుందని నాగమణి తెలిపారు.

రైలులో గర్భిణికి నొప్పులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్లో ఓ గర్భిణికి 108 సిబ్బంది ప్రసవం చేశారు. తిరుపూరు నుంచి జార్ఖండ్ వెళ్తున్న బొకారో ఎక్స్‌ప్రెస్‌లో బుధవారం సీత అనే గర్భిణికి రాజమహేంద్రవరం వచ్చేసరికి నొప్పులు మొదలయ్యాయి. విషయం తెలిసిన రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది రైల్వే స్టేషన్‌కు చేరుకుని, అక్కడే ఆమెకు డెలివరీ చేశారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఎమర్జెన్సీ టెక్నీషియన్ హనీష తెలిపారు. సకాలంలో స్పందించి, వైద్య సేవలు అందించిన 108 సిబ్బంది హనీష, పైలట్ గణేష్‌ను రైల్వే సిబ్బంది అభినందించారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

శ్రీనివాసుడికి లక్ష్మీ కటాక్షం

- వాడపల్లి వేంకటేశ్వరస్వామికి దండిగా ఆదాయం
- 27 రోజులకు రూ.80.46 లక్షల రాబడి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి హుండీల ద్వారా దండిగా ఆదాయం సమకూరింది. ఆలయంలోని హుండీలను బుధవారం తెరచి, లెక్కించగా 27 రోజులకు రూ.80,46,827 ఆదాయం వచ్చిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ప్రధాన హుండీల నుంచి రూ.60,63,558, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.19,83,269 సమకూరిందని వివరించారు. బంగారం 12 గ్రాములు, వెండి 309 గ్రాములు వచ్చాయని తెలిపారు. అలాగే ఆలయ క్షేత్రపాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీలను 27 రోజులకు లెక్కించగా రూ.2,17,269 ఆదాయం వచ్చిందని చెప్పారు. ఈఓతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, దేవదాయ శాఖ కోనసీమ జిల్లా సహాయ కమిషనర్ కేఎస్‌వీడీ వరప్రసాద్, పొడగట్లపల్లి ఆలయ ఈఓ ఎం.రాధాకృష్ణ, ముమ్మిడివరం గ్రూపు దేవాలయం ఈఓ పీకే లక్ష్మణరావుల పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కించారు.


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం


సార్వత్రిక విద్యాలయం ద్వారా చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

సువర్ణావకాశం ఓపెన్

- సార్వత్రిక విద్యలో టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్
- సాధారణ కోర్సులతో సమానంగా వీటికి గుర్తింపు
- అన్ని ఉద్యోగాలకూ అర్హత

రాయవరం: ఉన్నత విద్య చదవాలనే ఆశ ఉన్నా అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసిన వాళ్లు అనేక మంది ఉన్నారు. వివాహమైన తర్వాత, పెద్ద వయస్సు వచ్చేసిన తర్వాత చదువుకోలేకపోయామే అని దిగులు పడే వారూ ఉన్నారు. అటువంటి వారు పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా టెన్త్, ఇంటర్ చదివే వీలు కల్పిస్తోంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్‌లో కొన్ని సబ్జెక్టులు పూర్తి చేయలేకపోయిన వారు, ఉత్తీర్ణత పొందిన వాటిలో నుంచి గరిష్టంగా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకుని, మూడు సబ్జెక్టులతో మాత్రమే పరీక్షలు రాసే విధంగా ఓపెన్ స్కూల్ కోర్సును రూపొందించారు. జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్యలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. సార్వత్రిక వ్యికు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అక్రిడిడేటెడ్ ఇనిస్టిట్యూషన్లు (ఏఐ) 160 ఉన్నాయి. వీటి ద్వారా ఏటా వేలాది మందికి చదువుకునే అవకాశం లభిస్తోంది. ప్రవేశాలు పొందగోరే వారు అధ్యయన కేంద్రంలోని ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తును ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి. సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు అందించే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. దీని ద్వారా ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు అర్హత ఉంటుంది. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్‌సెట్ వంటి పరీక్షలతో పాటు ఆ అర్హతతో పొందే అన్ని ఉద్యోగాలకూ అర్హులే.

ఫీజు వివరాలు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ జూలైలో ప్రారంభమైంది. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెలాఖరు వరకూ ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. పదో తరగతిలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550, అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్+అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,150 చెల్లించాలి. ఇంటర్మీడియెట్‌లో జనరల్ పురుషులకు రూ.1,800, అన్ని వర్గాల మహిళలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీ వారికి రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి అదనంగా మీసేవ చార్జీలు రూ.36 చెల్లించాలి.

30 కాంటాక్టు తరగతులు

- ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, నెలలో రెండో శనివారం అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 20 కాంటాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.
- పదో తరగతిలో ప్రవేశం పొందాలనుకునే వారు గ్రూపు-ఎలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు-బిలో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి.
- ఇంటర్ గ్రూపు-ఎలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు-బి ప్రధాన సబ్జెక్టుల నుంచి మూడు కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంది.
- సార్వత్రిక పాఠశాలలో చేరే వారికి స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.
- అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసేవారు మాత్రం పదో తరగతి పాసై రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులూ ఒకేసారి రాసుకునే అవకాశం ఉంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక సబ్జెక్టు రాసుకోవచ్చు.
- అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి, ఉత్తీర్ణత పొందకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

మార్కుల బదలాయింపు

నియత పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలల్లో చేరి, సులభంగా ఉండే సబ్జెక్టులను ఎంపిక చేసుకుని పాసయ్యే అవకాశం ఉంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్ల లోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే రెగ్యులర్ టెన్త్, ఇంటర్‌లో పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండింటి మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. పదో తరగతిలో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలు రాస్తే సరిపోతుంది. మార్కులు బదలాయించుకునే వారు పదో తరగతికి అయితే సబ్జెక్టుకు రూ.100, ఇంటర్‌కు అయితే రూ.150 చొప్పున అడ్మిషన్ సమయంలో అదనంగా చెల్లించాలి.

జిల్లాల వారీగా ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులు

జిల్లా	టెన్త్	ఇంటర్	మొత్తం
కోనసీమ	855	3,358	4,213
కాకినాడ	1,061	3,556	4,617
తూర్పు గోదావరి	1,324	2,965	4,289
మొత్తం	3,240	9,879	13,119

ఇవీ అర్హతలు

- పదో తరగతిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.
- ఎలాంటి గరిష్ట వయోపరిమితీ లేదు.
- చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
- దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌కు పదో తరగతి మార్కుల జాబితా, టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కుల ధ్రువీకరణ పత్రంతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రం అందజేయాల్సి ఉంటుంది.

నెలాఖరు వరకూ గడువు



కొత్తగా అడ్మిషన్ పొందగోరే అభ్యర్థులు ఈ నెలాఖరులోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. మధ్యలో చదువు మానేసి తిరిగి కొనసాగించే వారికి ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా చదువుకునేందుకు ప్రభుత్వం చక్కని అవకాశం కల్పిస్తోంది.
– పి.సాయి వెంకట రమణ, జిల్లా కో ఆర్డినేటర్, ఏపీ సార్వత్రిక విద్యాపీఠం, అమలాపురం

ఏటా అడ్మిషన్లు పెరుగుతున్నాయి



ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా ప్రవేశాలు పొందే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రవేశాలు పొందిన అభ్యాసకులు తప్పనిసరిగా కాంటాక్టు క్లాసులకు హాజరు కావాలి. తగిన అర్హతలు, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చు.
– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు మార్గం



ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా చదువుకునే వారికి రెగ్యులర్ టెన్త్, ఇంటర్ మాదిరిగానే అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలకూ మార్గం ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు, చిరు ఉద్యోగాలు చేస్తూ పదోన్నతులు పొందాలనుకునే వారికి సార్వత్రిక విద్య ఎంతో ఉపయుక్తం. అధిక సంఖ్యలో అభ్యర్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రచారం చేయాలి.
– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ప్రాణాలు కాపాడిన కుక్క

- కుటుంబ సభ్యులు గాఢ నిద్రలో ఉండగా అగ్నిప్రమాదం
- అరచి లేపిన పెంపుడు శునకం
- సురక్షితంగా బయటపడిన కుటుంబం
- రూ.10 లక్షల ఆస్తినష్టం


ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు


ప్రాణాలు కాపాడిన ట్రిక్కీ

యానాం: విశ్వాసానికి ప్రతిరూపంగా కుక్క గురించి చెబుతారు. అది నిజమేనని నిరూపించింది ఆ శునకం. అర్ధరాత్రి ఆదమరచి నిద్రపోతున్న తన యజమాని కుటుంబాన్ని అగ్నిప్రమాదం నుంచి రక్షించింది. వివరాలివీ.. యానం కాకివారి వీధిలో కాకి నాగేశ్వరరావు అనే వ్యాపారి నివసిస్తున్నారు. ఆయన ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన పొరుగింటి వారు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను నిద్ర లేపేందుకు విఫల యత్నం చేశారు. అయితే నాగేశ్వరరావు పెంపుడు కుక్క ట్రిక్కీ... ఆ అగ్నికీలలను చూసి ఇంట్లో నిద్రపోతున్న వారి వద్దకు వెళ్లి, గట్టిగా అరవడం ప్రారంభించింది. దీంతో నాగేశ్వరరావు, ఆయన భార్య కనకదుర్గ, కుమారుడు సునీల్, ప్రజ్ఞ ఒక్కసారిగా మేల్కొన్నారు. ప్రమాదాన్ని గుర్తించి, ఇంటి నుంచి సురక్షితంగా బయట పడ్డారు. ట్రిక్కీ అరచినందు వల్లనే తమ ప్రాణాలు దక్కాయని, లేకుంటే అగ్నికి ఆహుతయ్యే వారమని బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని లక్షలాది రూపాయల విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. 15 కాసుల బంగారం, 500 గ్రాముల వెండి రూ.లక్ష నగదు, మంచాలు, ఫ్రిజ్, దుస్తులు, విలువైన భూమి డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు, రెండు మోటార్ సైకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. యానాం ఫైర్ ఇన్‌చార్జి మీరాసాహెబ్ ఆధ్వర్యాన ఫైర్‌మెన్ శ్రీనివాస్, కృష్ణారావు, వీరభద్రరావు, ప్రసాదరావు, రాజశేఖర్ ప్రమాద స్థలానికి చేరుకుని రెండు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఇల్లు కాలి బూడిదైపోయింది. పుదుచ్చేరిలో ఉన్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అక్కడి నుంచే బాధితులతో ఫోనులో మాట్లాడి ధైర్యం చెప్పారు. అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ


సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి బుధవారం భక్తులతో కిటకిటలాడింది. దసరా సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు సత్యదేవుని సన్నిధికి తరలివచ్చారు. వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు తెలిపారు. వ్రతాలు 1,650 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు. ఏర్పాట్లను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక చింతనతో జీవించాలి

- విజయదుర్గా పీఠాధిపతి గాడ్
- అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


అన్నపూర్ణాదేవి రూపంలో విజయదుర్గా అమ్మవారు

రాయవరం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని, అది మానసిక ప్రశాంతతనిస్తుందని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) భక్తులకు ఉద్బోధించారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం ఆయన పీఠానికి వచ్చిన భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరూ మంచి ఆలోచన, మంచి మనస్సు, దైవచింతన కలిగి ఉండాలని అన్నారు. దుర్గా మాత తోడుంటే ఎటువంటి సమస్యలనైనా ఎదుర్కొనే ధైర్యం ఉంటుందని, ప్రతి ఒక్కరూ అమ్మతత్వాన్ని అలవరచుకోవాలని సూచించారు. అమ్మవారిని కొలవడం ద్వారా పాడిపంటలు, ఆయురారోగ్యాలు, శుభాలు కలుగుతాయన్నారు. పలువురు భక్తులు సామూహిక కుంకుమ పూజల అనంతరం గాడ్ ఆశీస్సులు పొందారు. పీఠంలో విజయదుర్గా అమ్మవారు అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. చీమలకొండ వీరావధాని, చీమలకొండ శ్రీనివాస్, నాగేంద్రశర్మ తదితరుల అర్చకత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లలితా అష్టోత్తర సహస్ర నామాలతో కుంకుమ పూజలు, నీరాజన మంత్ర పుష్పాలు, ఏకవార రుద్రాభిషేకం, నవగ్రహ హోమం చేశారు. పీఠంలో భక్తులు కలశాలు ఏర్పాటు చేసుకుని, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించుకున్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్ఓ వాడ్రేవు వేణుగోపాల్ (బాబీ) ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

సైబర్ వలలో చిక్కుకోవద్దు

- బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా
- అదుపులో గంజాయి నేరాలు
- జిల్లా ఎస్పీ శ్రీధర్


రాయవరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

రాయవరం: సైబర్ నేరాలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ సూచించారు. సైబర్ వలలో చిక్కుకుని, ఆర్థికంగా నష్టపోవద్దని అన్నారు. రాయవరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసేందుకు బుధవారం వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆన్‌లైన్, వాట్సాప్, టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా యాప్‌లలో గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింకులను ఓపెన్ చేయకూడదని సూచించారు. సైబర్ మోసాలకు పాల్పడే వారు ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తుంటారని, అటువంటి ప్రకటనలను ఓపెన్ చేస్తే తెలియకుండానే సైబర్ వలలో చిక్కుకుని, ఆర్థికంగా నష్టపోయే అవకాశముంటుందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ కప్ క్రికెట్ పోటీలు జరుగుతున్నందున బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. బెట్టింగ్‌లకు పాల్పడే వారితో పాటు వారికి ఆశ్రయం ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని ఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. గత మూడేళ్లతో పోలిస్తే జిల్లాలో గంజాయి కేసులు గణనీయంగా తగ్గాయన్నారు. వివిధ గంజాయి కేసుల్లో 365 మందిని అరెస్టు చేశామని, వారిలో 72 మంది ఇంకా జైళ్లలోనే ఉన్నారని చెప్పారు. జైలు నుంచి విడుదలైన వారిపై కూడా నిఘా పెడుతున్నామని స్పష్టం చేశారు. గంజాయి కేసులను సున్నా శాతానికి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దిశ, పోక్సో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా మెడికల్, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లను గుర్తిస్తున్నామన్నారు. గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల వద్ద రహదారి ప్రమాదాలకు కారణాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు ఎస్పీ శ్రీధర్ పోలీస్ స్టేషన్‌ను ఆసాంతం పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, కేసులపై సమీక్షించారు. ఆయన వెంట రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ ఆర్‌కే ప్రసాద్, మండపేట రూరల్ సీఐ కొమ్ము శ్రీధర్‌కుమార్, ఎస్సై జి.నరేష్, ఏఎస్సై పి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

కొబ్బరి ఉత్పత్తులను పరిశీలించిన కేంద్ర బృందం


కొబ్బరిపీచుతో తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మామిడికుదురు: కొబ్బరి ఉత్పత్తులను కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. ఏపీ, తెలంగాణ హ్యాండీక్రాఫ్ట్స్ క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధీర్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం పాశర్లపూడి, మామిడికుదురు, ఈదరాడ గ్రామాల్లో బుధవారం పర్యటించింది. పాశర్లపూడిలో కొబ్బరి పీచుతో తయారు చేస్తున్న బొమ్మల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. రెండు గ్రామాల్లోనూ కొబ్బరి పీచుతో మహిళలు తయారు చేస్తున్న బొమ్మలు, గోదినీలను నిశితంగా పరిశీలించారు. కోనసీమలోని బండారులంక టెక్స్‌టైల్ పరిశ్రమ, పాశర్లపూడిలో కొబ్బరి పీచుతో తయారు చేసే బొమ్మల పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరుతూ కేంద్ర జౌళి శాఖ మంత్రి దర్శనా జర్దోష్‌కు ఆర్టిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం ఇటీవల వినతి పత్రం అందించారు. బండారులంక చీరలు, క్వాయర్ ఫైబర్ బొమ్మలు రెండు విభిన్న మినీ క్లస్టర్లుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు కేంద్ర బృందం సభ్యులు కోనసీమలో పర్యటించారు. పరిశీలన నివేదికను మంత్రికి అందజేస్తామని బృందం సభ్యులు తెలిపారని గంగాధరం చెప్పారు.